పట్టుబట్టారు.. కొలువు కొట్టారు..

- ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించి విధుల్లో చేరిన ఉపాధ్యాయులు
- ముగ్గురు టీచర్లు, ఒకరు ప్రిన్సిపాల్, మరొకరు కానిస్టేబుల్‌గా ఎంపిక

ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు సాధించిన అండ్రాస రవి, మంజుల దంపతులు

కమలాపూర్, అక్టోబర్ 27 : కష్టపడితే సాధించనిది లేదని నిరూపించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా పట్టుదల ముందు తలవంచక తప్పదని ఉప్పల్ గ్రామానికి చెందిన అండ్రాస మంజుల, అన్నం సరేష్, మంత్రి హరీశ్, సిరికొండ మోహన్‌కుమార్ నిరూపించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. టీజీపీఎస్సీ మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌గా అండ్రాస రవి ఎంపికై విధుల్లో చేరాడు. అలాగే మంత్రి అనిల్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయి శిక్షణ పొందుతున్నాడు. పేద, మధ్యతరగతికి చెందిన వ్యక్తులు ఉద్యోగం సాధించడంతో ఆ కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుని తనను నమ్ముకున్న వారికి భారం కాకూడదని పట్టుబట్టి ఉద్యోగం సాధించిన వారి వివరాలు..

కూలి పనులు చేసి చదివించారు..
– మోహన్‌కుమార్, టీచర్

సిరికొండ భాగ్యలక్ష్మి–శ్రీనివాస్ దంపతులకు కొడుకు మోహన్‌కుమార్, కూతురు శిరీష ఉన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కొడుకు మోహన్‌కుమార్‌ను చదవించారు. ప్రాథమిక విద్య పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. ఇంటర్, డీగ్రీ, బీఈడీ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో పూర్తి చేశాడు. 2017లో డీఎస్సీ పోస్టులు జిల్లాలో జీరో ఉండడంతో రాయలేదు. ప్రైవేట్ స్కూళ్లలో టీచర్‌గా పనిచేస్తూ కానిస్టేబుల్‌గా ప్రిపేర్ అయినా ఎత్తు లేకపోవడంతో అర్హత సాధించలేదు. 2024 డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించి మండలంలోని గుండేడు ప్రాథమికోన్నత పాఠశాలలో విధుల్లో చేరాడు.

భర్త ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించా..
– అన్నం సరేష్, టీచర్

నాది ధర్మసాగర్ మండలం ముప్పారం. నాలుగేళ్ల క్రితం కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మేడిపల్లి సిద్ధుతో వివాహమైంది. పదో తరగతి వరకు నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలలో చదివాను. డీఎడ్ యాస్మిన్ కళాశాల ఉనికిచర్లలో పూర్తి చేశాను. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కష్టపడి చదివాను. నా భర్త సిద్ధుతో పాటు అమ్మానాన్నల సహకారంతో డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 6వ ర్యాంకు సాధించి ఎల్కతుర్తి బీసీ పాఠశాలలో టీచర్‌గా విధుల్లో చేరాను.

భార్య టీచర్.. భర్త టీజీటీ ప్రిన్సిపాల్

మధ్య తరగతి కుటుంబానికి చెందిన అండ్రాస రవి చిన్నప్పటి నుండి కష్టపడి చదువుకుని కాకతీయ యూనివర్సిటిలో మూడు పీజీలు పూర్తిచేశాడు. జాతీయ అర్హత పరీక్ష నీట్, సెట్ పరీక్షలు రాసి సెలెక్ట్ అయి పదేండ్లపాటు ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో టీచర్, లెక్చరర్‌గా, ఎంజేపీ బీసీ బాలుర గురుకుల విద్యాలయం కమలాపూర్‌లో గెస్ట్ టీచర్‌గా పనిచేశాడు. 2021లో పంచాయతీ కార్యదర్శిగా శాయంపేట మండలం కాట్రపల్లిలో విధులు నిర్వర్తించాడు. 2024లో గురుకుల టీచర్ పోస్టుల్లో టీజీటీ సోషల్ వెల్ఫేర్ సొసైటీకి ఎంపికయ్యాడు. టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సత్తా చాటి భూపాలపల్లి మైనార్టీ బాలుర గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య మంజుల ఇంటి వద్ద ఉంటూ బట్టలు కుడుతూ ఎంఏ తెలుగు టీపీటీ పూర్తి చేసింది. నీట్, సెట్‌లో అర్హత సాధించింది. 2024 గురుకుల పరీక్షలో జూనియర్ లెక్చరర్‌గా తెలుగులో 1:2నిష్పత్తిలో అర్హత సాధించి తుది ఫలితాల్లో ఎంపిక కాలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా డీఎస్సీ–2024లో తెలుగు పండిట్ గ్రేడ్–2లో ఉద్యోగం సాధించింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అరవయ్యపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విధుల్లో చేరింది. ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తలు ఉద్యోగాలు సాధించడం గర్వకారణం.

అన్న టీచర్, తమ్ముడు కానిస్టేబుల్..

ఆస్తిపాస్తులు లేకున్నా తల్లిదండ్రులు మంత్రి భాగ్యలక్ష్మి–సంపత్ దంపతులు కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కొడుకులను ఉన్నత చదువులు చదివించారు. పెద్దకొడుకు హరీశ్, చిన్న కొడుకు అనిల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. హరీశ్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసి, 2015లో డీఈఈడీ చేశాడు. ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్‌గా పనిచేస్తూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో టీచర్‌గా ఉద్యోగం సాధించి మండలంలోని గుండేడు ప్రాథమికోన్నత పాఠశాలలో విధుల్లో చేరాడు. అనిల్ ప్రాథమిక విద్య స్వగ్రామంలో, ఇంటర్ హుజూరాబాద్, డిగ్రీ హనుమకొండలో పూర్తి చేశాడు. 2016, 2018, 2022లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించేందుకు మూడుసార్లు ప్రయత్నించాడు. అయినా నిరాశ చెందకుండా 2024లో టీజీఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. ఇద్దరు కొడుకులు ఉద్యోగం సాధించి కష్టపడి పెంచిన తల్లిదండ్రుల కలలను సాకారం చేయడం అభినందనీయం.

ఎన్‌హెచ్ అధికారుల తప్పిదం..
ప్రజలకు తప్పని ఇక్కట్లు

- రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని నెల రోజులుగా నాలుగు గ్రామాల ప్రజల రిలే దీక్షలు
- స్పందించని అధికారులు

వల్భాపూర్‌లో వీరనారాయణపూర్, దండేపల్లి గ్రామాలకు వెళ్లే దారి మధ్యలో నుంచి వేస్తున్న రోడ్డు

ఎల్కతుర్తి, అక్టోబర్ 27 : ఎన్‌హెచ్–563 విస్తరణలో భాగంగా అధికారులు చేసిన తప్పిదం వల్ల నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని నెల రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇది వరకు ఉన్న ఎన్‌హెచ్–563 రహదారి మండలంలోని ఎల్కతుర్తి, సూరారం బస్టాండ్, వల్భాపూర్, కోతులనడుమ గ్రామాల మీదుగా వెళ్లేది. వాహనాల రద్దీ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం రోడ్డు వెడల్పు చేస్తున్నది. అయితే ఎన్‌హెచ్ అధికారులు తమ ఇష్టారీతిన రోడ్డు పనులకు ప్రతిపాదనలు పంపడంతో అప్పట్లోనే వల్భాపూర్, కోతులనడుమ గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రాస్తారోకోలు, ధర్నాలు సైతం జరిగాయి. అయితే ఇటీవల పనులు ప్రారంభించిన అధికారులు కొన్ని ప్రాంతాల్లో కనీస అవగాహన లేకుండా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వల్భాపూర్, కోతులనడుమ గ్రామాల మధ్యలో నుంచి ప్రధాన రహదారి వెళ్తున్నది. వీరనారాయణపూర్, దండేపల్లి, ఆ గ్రామాల ప్రజలు జీల్గుల, గోపాల్‌పూర్, ముల్కనూర్ గ్రామాలకు వెళ్లాలంటే ఇదే రహదారి మధ్యలో నుంచి వెళ్లాలి. ఇప్పుడు హైవే విస్తరణ పనులు ప్రారంభించిన అధికారులు మాత్రం ఆయా గ్రామాలకు వెళ్లే రూట్లను చూపించలేదు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారి కింద అండర్ పాస్ లేదా పైనుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంటుంది. అలాగే వల్భాపూర్, కోతులనడుమ గ్రామాలు సైతం రెండుగా విడిపోయి రహదారి ఇరువైపులా ఉన్న ప్రజలకు సంబంధాలు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. వీరనారాయణపూర్, దండేపల్లి గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామాల ప్రజలు నెల రోజుల క్రితమే రిలే నిరాహార దీక్షలు ప్రారంభించి, రోడ్డుపై సైతం బైఠాయించారు. దీనికి స్పందించిన తహసీల్దార్ జగత్‌సింగ్ ఆర్డీవో, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు సమస్య అలాగే ఉన్నది. తమ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేద్కర్, పూలే ఆశయాలు కొనసాగించాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 27 : ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగించాలని టీజీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో 'బాంసెఫ్' 11వ రాష్ట్ర సదస్సు 'భారతీయ రాజకీయాలపై మూల్ నివాసీ–బహుజన ఉద్యమం ప్రభావం' అనే అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, వాస్తవంగా ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమానత్వం లేకపోతే ఒకరి ఆధిపత్యంలో బతకాల్సి వస్తుందని, అప్పుడు స్వేచ్ఛ ఉండీ ప్రయోజనం ఉండదన్నారు. సమాజంలో సమూలమైన మార్పు దిశగా బాంసెఫ్ కొన్ని సంవత్సరాలుగా 21 రాష్ట్రాల్లో పనిచేస్తున్నదని రాష్ట్ర అధ్యక్షుడు బుర్రా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సామాజిక విశ్లేషకులు స్కైబాబా, సీఈసీ తెలంగాణ ఇంఛార్జి ఎన్ శ్రీధర్ పాల్గొన్నారు.

కళాకారుల హామీలపై సీఎం నోరు మెదపకపోవడం బాధాకరం

కాజీపేట, అక్టోబర్ 27 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై నోరు మెదపకపోవడం బాధాకరమని జిల్లా ఉద్యమ కళాకారుల ఫోరం కో ఆర్డినేటర్, నంది అవార్డు గ్రహీత వెన్నమల్ల వెంకటేశ్ అన్నారు. కాజీపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో నిర్బంధాలను తట్టుకుని రాష్ట్రం సిద్ధించే వరకు పోరాటం చేశామన్నారు. ఉద్యమ వృద్ధ కళాకారులకు రూ.25 వేల పెన్షన్, 250 గజాల స్థలం, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రత్యేక గుర్తింపు కార్డులు, బస్సు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిర్రు సురేందర్, పాలాటి రాజు, నాగుల సుధాకర్, అంకుష్, రాజు, గబ్బెట కృష్ణ, గట్టయ్య, పిట్టల సతీశ్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

దామెర, అక్టోబర్ 27 : మండలంలోని గ్రామాల్లో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించాలని దామెర మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. ఆదివారం ల్యాదెళ్లలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా ఇప్పటివరకు గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లను నిర్మించడం లేదన్నారు. డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడం వల్ల రోడ్లపైకి మురుగునీరు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు హింగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

తరగతుల పరిశీలన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 27 : రెగ్యులర్‌గా పాఠశాలకు రాలేక, మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ విధానం ఒక వరమని ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ శంకర్‌రావు అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తరగతులను ఆదివారం పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ రెండు విభాగాలకు కౌన్సిలర్ల ద్వారా విద్య అందిస్తామన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో నిర్వహించే తరగతులకు తప్పకుండా హాజరుకావాలన్నారు. టాస్ కో ఆర్డినేటర్ భూక్యా బాలు, కౌన్సిలర్లు వాసు, కరుణ, ఎడ్ల శ్రీనివాస్, నర్సయ్య, వలస పైడి, కిరణ్‌కుమార్, కాంతయ్య పాల్గొన్నారు.

40కిలోలకు మించి ధాన్యం తూకం వేస్తే కేసులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, అక్టోబర్ 27 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, 40కిలోల 650 గ్రాములకు మించి తూకం వేస్తే కొనుగోలు నిర్వాహకులు, మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. శాయంపేటలోని రైతు వేదికలో ఆదివారం 47 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.47లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే 27 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.7.54లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే మార్చి 31 నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే భూ మాతను అమలు చేస్తామన్నారు. జనవరి ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తామన్నారు. వసంతాపూర్, గంగిరణిగూడేనికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కిరాయికి, గుడిసెల్లో ఉండేవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రూ.5లక్షలతో ఇండ్లు కట్టిస్తామన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పడగానే ఆడబిడ్డలకు నెలకు రూ.2500 అందిస్తామన్నారు.

వరంగల్‌కు బస్సు సర్వీసు ప్రారంభం..

శాయంపేట మీదుగా వరంగల్‌కు బస్సు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం టికెట్ కొనుగోలు చేసి బస్సులో కొద్దిదూరం ప్రయాణించారు. బస్సు ఆత్మకూరు, అక్కంపేట, పెద్దాపూర్, మొగిలిచర్ల, ఎనుమాముల మార్కెట్ మీదుగా వరంగల్‌కు వెళ్తుందన్నారు. ఆర్డీవో నారాయణ, ఆర్టీసీ మేనేజర్ రవిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, బాసాని చంద్రప్రకాశ్, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిందం రవి పాల్గొన్నారు.

సైకిల్ రైడర్స్‌తో సీపీ అంబర్ కిశోర్ ఝా

నగరంలో సైకిల్ రైడింగ్

సుబేదారి, అక్టోబర్ 27 : పోలీసు అమవీరులు సంస్మరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో సైకిల్ రైడింగ్ నిర్వహించారు. హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ హనుమకొండ చౌరస్తా, ఎంజీఎం దవాఖాన, మట్టెవాడ, హంటర్‌రోడ్డు, బాలసముద్రం ద్వారా తిరిగి సీపీ కార్యాలయం వరకు సాగింది.

సోమిడిలో శతాధిక వృద్ధురాలు మృతి

కొమురమ్మ(ఫైల్)

కాజీపేట, అక్టోబర్ 27 : కాజీపేట పట్టణం సోమిడికి చెందిన శతాధిక వృద్ధురాలు కాగిత పెద్ద గొల్ల కొమురమ్మ (110) ఆదివారం మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొమురమ్మ ఐదు తరాల మనవళ్లను చూచింది. కొమురమ్మకు ఐదేళ్ల క్రితం పాల దంతాలు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దహన సంస్కార కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత–వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ రమా యాదవ్, జిల్లా గొర్రెల కాపరుల మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

అంజలి (ఫైల్)

ఎల్కతుర్తి, అక్టోబర్ 27 : మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన వివాహిత సుదాటి అంజలి (30) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. అంజలి కొన్ని రోజులుగా వివిధ కారణాలతో బాధపడుతుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమెకు భర్త రాజగోపాల్, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఊరుగొండలో వ్యక్తి అదృశ్యం

రవీందర్(ఫైల్)

దామెర, అక్టోబర్ 27 : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన ఇజ్జగిరి రవీందర్ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ ఈ నెల 25న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రవీందర్ భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే నాగరాజుతో నాయకులు

సిద్ధాపూర్‌కు ఓపెన్ వెల్ పంప్ సెట్ మంజూరు
డయల్ యువర్ ఎమ్మెల్యే ఫోన్‌కు స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, అక్టోబర్ 27 : మండలంలోని సిద్ధాపూర్‌లో కొద్దిరోజుల క్రితం బోరు కాలిపోయింది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఉదయం గ్రామస్తులు డయల్ యువర్ ఎమ్మెల్యే ఫోన్‌కు కాల్ చేసి గ్రామంలో నీటి సమస్యపై వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆదివారం 15 హెచ్‌పీ ఓపెన్ వెల్ పంప్ సెట్ బిగించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండలాధ్యక్షుడు పొరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, వెంకటస్వామి ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే నాయిని

31వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, అక్టోబర్ 27 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 31వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన ఆదివారం పర్యటిస్తూ అంతర్గత రోడ్డు, సైడ్ డ్రెయిన్లను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జూలైవాడ నుంచి నంది హిల్స్ కాలనీ మీదుగా వెళ్లిన వరదతో ఇళ్లు దెబ్బతిన్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కాలనీల్లో పర్యటించి నివేదికలు అందించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను ఒక్కొక్కటికగా చేస్తున్నామని, ఐదేళ్లల్లో ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాధవి, మోహన్‌రావు, కాలనీ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టును చూపుతున్న పోలీసులు

గుడుంబా రవాణా చేస్తున్న ఒకరి అరెస్ట్

శాయంపేట, అక్టోబర్ 27 : అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి బైకును స్వాధీనం చేసుకున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ ఆదివారం తెలిపారు. కొప్పుల గ్రామ శివారులో రూట్ వాచ్ నిర్వహించి తిరిగి వస్తుండగా కొప్పులకు గుడుంబా రవాణా చేస్తున్న సూర్యనాయక్ తండాకు చెందిన లావుడ్యా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 20 లీటర్ల గుడుంబాతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రూట్‌వాచ్‌లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ పోల్ నిర్మించారు.. లైట్స్ బిగించడం మరిచారు..

జయగిరిలో లైట్లు లేని విద్యుత్ పోల్

హసన్‌పర్తి, అక్టోబర్ 27 : మండలంలోని జయగిరి బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ లైట్లు లేక నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న క్రమంలో ఎంపీ నిధుల నుంచి రెండేండ్ల క్రితం హైమాస్ట్ లైట్లను మంజూరు చేసి విద్యుత్ పోల్‌ను నిర్మించారు. కానీ ఇప్పటివరకు ఆ విద్యుత్ పోల్‌కు లైట్లను మాత్రం బిగించలేదు. సదరు కాంట్రాక్టర్ జాడ లేకుండా పోయాడు. గ్రామస్తులు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు లేదా ఎమ్మెల్యే నాగరాజు స్పందించి హైమాస్ట్ లైట్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

సన్న ధాన్యానికే బోనస్ : రేవూరి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల, అక్టోబర్ 27 : రైతులు పండించిన సన్న ధాన్యానికే బోనస్ అందిస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. హమాలీలు, గోనె సంచుల కొరత లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

సుబేదారి, అక్టోబర్ 27 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి హనుమకొండ పోలీసులు బాధితులకు అందజేశారు. హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ వచ్చిన తర్వాత 381మంది సెల్ ఫోన్ బాధితులు దరఖాస్తు చేసుకోగా, విచారణ చేపట్టి అన్నింటినీ ట్రాక్ చేసి తిరిగి బాధితులకు అందజేశారు. ఆదివారం 11మందికి హనుమకొండ పోలీసు స్టేషన్‌లో సెల్ ఫోన్లను అందజేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, అక్టోబర్ 27 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

సహకార స్ఫూర్తికి కల్పలత సూపర్ బజార్ నిదర్శనం

వరంగల్, అక్టోబర్ 27 : ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం సంఘం అనేది సహకార రంగానికి స్ఫూర్తి అని, దానికి కల్పలత సూపర్ బజార్ నిదర్శనంగా నిలుస్తున్నదని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుల బృందం అభిప్రాయపడింది. సహకార రంగంపై అధ్యయనం చేయడానికి వరంగల్ నగరంలోని కల్పలత సూపర్ బజార్‌ను మున్నూరుకాపు బృందం సందర్శించింది. సూపర్ బజార్ ఎదుగుదల, పెట్రోల్ బంక్ నిర్వహణ తీరును సూపర్